నమస్తే తెలంగాణ
కామారెడ్డి
మంగళవారం 28 నవంబర్ 2023



# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!




# దగాకోరు కాంగ్రెస్

## రైతులను ముంచేలా కుట్రలు

- అధికారంలోకి రాకముందే అన్నదాతల నోట్లో మన్ను పోస్తున్న వైనం
- రైతుబంధు నిలిచిపోయేలా హస్తం పన్నాగం
- కాంగ్రెసోళ్లకు ఓటేస్తే.. మనగోతి మనమే తవ్వుకున్నట్లేనని రైతుల ఆవేదన
- రైతు సంక్షేమం.. కేసీఆర్‌తోనే సాధ్యం
- రిస్క్ తీసుకోం.. కారునే గెలిపిస్తామని స్పష్టీకరణ

**దగాకోరు కాంగ్రెస్** అన్నదాత నడ్డివిరిచే కుయుక్తులు పన్నుతున్నది. రైతుల నోటికాడి కూడును లాగేస్తున్నది. అధికారంలోకి రాకముందే రైతులను శత్రువులుగా చూస్తున్న కాంగ్రెసోళ్లు.. ఇగ అధికారంలోకి వస్తే పరిస్థితి ఏంటనే ఆలోచనలో పడుతున్నారు కర్షకులు. పదవుల కోసం వ్యవసాయమే లేకుండా చేయాలనే కుట్రలు చేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నేతృత్వంలో రైతు క్షేమంగా ఉంటే.. కాంగ్రెసోళ్లు రైతులకు నిద్రలేకుండా చేయాలని చూస్తున్నారు. మెరుగైన వ్యవస్థలను రూపుమాపి అన్నదాతలను ఆగం చేయాలని చూస్తున్నది. ధరణి తొలగించి దళారుల రాజ్యం తెచ్చి, రైతుల మధ్య భూ పంచాయితీలు, గొడవలకు ఉసిగొల్పాలని కాంగ్రెస్ ఆలోచిస్తున్నది. కరెంటును బంద్ చేసి పచ్చని పంట భూములను బీడుగా మార్చి, వ్యవసాయమే లేకుండా చేయాలని చూస్తోందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు. తాజాగా యాసంగి పంటకు పెట్టుబడి అందించేందుకు ప్రభుత్వం ఈసీ అనుమతి తీసుకోగా.. దానిని కూడా రైతులకు అందకుండా కాంగ్రెసోళ్లు అడ్డుకోవడంపై కర్షకులు మండిపడుతున్నారు. అధికారంలోకి రాకముందే రైతులను పట్టిపీడిస్తున్న కాంగ్రెసోళ్లకు.. అధికారం ఇస్తే మన గొయ్యి మనమే తవ్వుకునేటట్లు చేస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే రిస్క్ తీసుకోబోమని, రైతు సంక్షేమ సర్కారు అయిన కేసీఆర్‌నే గెలిపిస్తామని స్పష్టం చేస్తున్నారు.

-సదాశివనగర్/బిచ్కుంద/పిట్లం/పెద్దకొడప్‌గల్, నవంబర్ 27



## ఎవన్కి గావాలె మూడు గంటల కరెంట్..



**కాంగ్రెస్ పార్టీ** అంటేనే కబ్జా బాబాల పార్టీ అని పేరు ఉన్నది. తెలంగాణ ప్రభుత్వంలో కేసీఆర్ సార్ ఇచ్చే 24 గంటల కరెంటును తీసేసి 3 గంటల కరెంట్ మస్తు అంటుండు. ఎవన్కి గావాలె నీ మూడు గంటలు? ఎవుసం అంటే తెల్వని కాంగ్రెస్ పార్టీ వాళ్లు మాట్లాడుతుంటే నవ్వొస్తున్నది. రైతుల బతుకులు బాగుపడాలంటే మంచిగా ఆలోచన చెయ్యాలె.. నాలుగు బోర్లు ఏసినా నీళ్లు పడలేదు. అప్పుల పాలైనం. సీఎం కేసీఆర్ పుణ్యమా అని 24 గంటల కరెంటు ఇచ్చుడుతోనే కొంచెం మంచిగున్నం. కాంగ్రెస్ సర్కారు వస్తే మల్లీ మా బతుకులు ఆగమే.

-దర్పల్ గంగారం, బిచ్కుంద

## 10 హెచ్‌పీ మోటర్లకు మస్తు పైసల్ గావాలె..



**గతంలో కాంగ్రెస్** ప్రభుత్వం రాత్రిపూట కరెంట్ ఇచ్చెటోళ్లు. ఆ ఇచ్చిన కరెంటుతో పొలం సరిగ్గా పారేదికాదు. ఇప్పుడు తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. రంది లేకుంట ఎవుసం చేసుకుంటున్నం. పొలాలన్నీ పచ్చగా ఉన్నయ్. కాంగ్రెస్ వస్తే ఎవుసాన్ని మొత్తం ఖరాబ్ చేస్తరు. 3 గంటల కరెంటు ఇస్తే పొలం పారుతదా. 10 ఎస్పర్ మోటర్ల పెట్టుకోవాల్నంటే మస్తు పైసల్ గావాలె. చిన్న రైతులు గంతగానం పెట్టుబడి పెడ్తడా? పెట్టుబడి పెట్టేకన్నా.. భూములను ఎండవెట్టుకొని ఇంట్ల కూసోవాలె. ఎకరం, రెండెకరాలు ఉన్నోడు గంతపెద్ద మోటర్ పెట్టుకుంటడా? రైతులు, ఎవుసం గురించి తెల్వనోడకి రాజ్యమిస్తే మొదటికే మోసం వస్తది.

-విఠల్, చిన్నదడ్గి, బిచ్కుంద మండలం

## కాంగ్రెస్ వస్తే దీపాలు, కందీళ్లు రడీ పెట్టుకోవాలె..



**కాంగ్రెస్** ఇచ్చే మూడు గంటల కరెంటుతో రైతులు పొలాల దగ్గర రోజూ జాగారం చెయ్యాల్సి ఉంటది. కరెంటు కోసం పొద్దు.. మాపూ ఎదురుచూసుకుంటూ ఉండాలె. గప్పట్ల పంటలకు నీళ్లు పెడ్దామంటే కరెంటే రాకపోతుండె. సగం ఎండిపొయ్యేటివి. బీఆర్ఎస్ సర్కారు 24 గంటల కరెంట్ ఇస్తున్నది. బాయికాడ నిద్ర పోవుడే లేదు. మల్లీ కాంగ్రెస్ గవర్నమెంట్ వస్తే దీపాలు, కందిళ్లు రడీ పెట్టుకోవాలె.

-గద్దర్, రైతు, వజ్జపల్లి తండా, సదాశివనగర్

## బోర్ల నుంచి నీళ్లు కాదు.. దుమ్మే వస్తది..



**అప్పుడో గంట..** ఇప్పుడో గంట కరెంటిస్తే ఎవుసం చేసుడెందుకు. రైతులు ఎవుసం మానేసి వేరే పనులు చూసుకోవాలె. 10 ఎస్పర్ మోటర్లు పెడ్తే ఇప్పడు ఉన్న బోర్ల నుంచి 5 నిమిషాలల్ల నీళ్లన్నీ గుంజేస్తది. ఆ తర్వాత మొత్తం దుమ్మే బయటికి వస్తది. మా నోట్లె దుమ్ము వడ్తది. సీఎం కేసీఆర్ వచ్చినంక 24 గంటల కరెంటు ఇచ్చుడుతోని బీడు భూములన్నీ పచ్చగైనై. బోర్లు ఏసుకున్న రైతులు ఏ రందీ లేకుంట ఎవుసం చేసున్నరు. సంతోషంగా ఉన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం 3 గంటల కరెంటు ఇస్తామంటే ఎం జేసుకోవాలె. మళ్లా శివార్లల్ల పండుకోవాల్నా? కాంగ్రెస్‌తోని గవన్నీ బాధలు మాకెందుకు. గిదే సర్కారు మంచిగున్నది.

-గోపి దత్తు, బిచ్కుంద

## మూడు గంటల కరెంట్‌తో గుంట కూడా తడ్వది..



**జనాలను** మోసం జెయ్యతందుకు కాంగ్రెస్ మస్తు ప్రేమ ఒల్కవోస్తున్నది. 3 గంటల కరెంటంట.. రైతులు ఏం జేస్కుంటరు. మూడు గంటలల్ల ఒక్క గుంటనన్నా తడుస్తదా? రెండెకరాలు ఉంటే.. ఒక ఎకరం ఎండవెట్టుకునుడే. గప్పుడట్లనే జేశింద్రు. కరెంటు ఒక్కనాడు గూడా సక్కడ ఉండకుండె. ఒక మనిషి పొలం కాడనే కరెంటు కోసం కావలి గాస్తుండె. లేదంటే కరెంట్ ఎప్పుడస్తే అప్పుడే బాయికాడికి ఉరుకుతుంటిమి. కరెంటు.. నీళ్లతోని దినాం తిప్పలే ఉంటుండె. కేసీఆర్ వచ్చినంక 24 గంటల కరెంట్ ఇస్తుండు. గిప్పుడు కొంచం రైతులు హరాం ఉన్నరు. కాంగ్రెస్ గెలిస్తే మళ్లా ఆగమైతం.

-బోంపల్లి రాజేశ్వర్‌రావు, రైతు, ఉత్తునూర్, సదాశివనగర్



## కాంగ్రెస్ కరంటు.. దీపెం కన్నా అద్మానంగా ఉండె..

**కేసీఆర్ సర్కారు** వచ్చినప్పటి సంది నిమిషం గూడా కరంటు పోతలేదు. నా చిన్నతనంల కాంగ్రెస్ సర్కారే ఉండేది. ఇండ్లల్ల చిమ్మ చీకటి. ఊళ్లె కరంటు ఉండకుండె. నా లగ్గం అయినంకడ కరెంట్ అచ్చింది. మా ఇంట్ల ఒకటే కరంట్ బుగ్గ ఉండేది. ఎప్పుడు ఏసినా మిన్కు మిన్కుమనుడే. దీపెం కన్నా అద్మానం. ఇగ పొలాలకువోయి నీళ్లు వెట్టెటోళ్లు మస్తు బాధలు వడ్డరు. పాములు, తేళ్లు కర్షి మస్తుమంది సచ్చింద్రు. కరెంటు షాకుతోని గూడా పానాలు పొయినయ్.. మళ్లీ గాళ్లే రాజ్యమేలుతమంటే బుగులైతుంది. గిప్పుడెంత మంచిగ కరెంటు ఉంటున్నది.

-రెడ్డి మల్లవ్వ, రైతు, సదాశివనగర్



## కరెంటు తీసేస్తమంటే ఊరుకుంటమా?

**వ్యవసాయానికి** 3 గంటల కరెంట్ ఇస్తామంటే ఎంత కష్టం. రైతుల కష్టాలు కాంగ్రెసోళ్లకి ఏం ఎరుక. వ్యవసాయం గురించి తెలిసిన కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తుంటే మంచిగ పనులు చేసుకుంటున్నం. మూడు గంటల కరెంటే చాలని ప్రకటించిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్తాం. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంకనే కరెంటు కష్టాలన్నీ దూరమైనై. మళ్లీ కాంగ్రెస్ వచ్చి కరెంటు తీసేస్తం అంటే ఊరుకుంటమా? రైతు పక్షపాతి కేసీఆర్‌నే గెలిపిస్తం.

-కందూరి బీరయ్య, గొర్రె మేకల సంఘం అధ్యక్షుడు, అడ్లూర్ ఎల్లారెడ్డి



## 10 హెచ్‌పీ మోటర్‌తోని పైప్‌లైన్లు ఆగుతయా?



**కాంగ్రెస్** నాయకుడు రేవంత్‌రెడ్డి చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే ఇప్పుడున్న పైప్‌లైన్లు ఆగుతయా.. ఎక్కడికక్కడ పల్గిపోతయ్. మా బోర్ దగ్గర నీళ్లు పారడానికి రెండున్నర ఈంచుల పైప్‌లైన్ ఏసుకున్నం. ఉన్న మోటర్‌ను పీకేసుకొని చెత్తల పడెయ్యాలె. లక్షలు పెట్టి కొత్తగా 10 హెచ్‌పీ మోటర్ కొనాలె. పైప్ లైన్ కూడా పీకెయ్యాలె. గివన్నీ మాలాంటి గరీబ్ రైతులతోని గావు. కాంగ్రెస్ మాటలింటే ఎవుసం వదిలేసి దేశాలు పట్టుకొని పోవాలె.

-దౌలత్, ఖండెబల్లూర్, బిచ్కుంద మండలం

## కరెంటు కోసం రైతులు దెబ్బల్ తిన్నరు..



కాంగ్రెస్ గెలిస్తే రైతులకు 3 గంటలే కరెంట్ ఇస్తమంటుండ్రు. పదేండ్ల కిందట సక్కగ కరెంటు లేక రైతులు ధర్నాలు చేసింద్రు. సబ్‌స్టేషన్‌కు పోయి ముట్టడి చేసింద్రు. పోలీసులతోని దెబ్బల్ తిన్నరు. పాపం మళ్లా కరెంటు కోసం బాధలు పడాల్నా? బీఆర్ఎస్ సర్కారోళ్లు గిప్పుడెంత మంచి కరెంటు ఇస్తుంద్రు. పొలాలల్ల పోతలే.. ఇండ్లళ్ల పోతలేదు. రైతులకైతే 24 గంటలు ఉచితంగా కరెంటు ఇస్తున్నరు. వారికి కొన్ని పైసల్ కూడా మిగులుతున్నయ్. గింతమంచి సౌలత్ ఉన్న కరెంటును రైతులు వద్దనుకుంటరా? తెలంగాణకు రానియ్యరు.

-దొడ్ల నరేందర్‌రావు(రవి), రైతు, ఉత్తునూర్, సదాశివనగర్

తెలంగాణ వ్యవసాయాన్ని దేశచిత్రపటంలో పెట్టినోళ్లకా?

ఎకరం పారకానికి ఎన్ని గంటల కరెంటు కావాలో తెల్వనోళ్లకా?

నీ ఓటు ఎవరికి?

తెలంగాణమా తేల్చుకో

## 10 ఎస్పర్ మోటర్లు పెట్టాలంటే ఆస్తులమ్ముకోవాలె..



**కాంగ్రెస్ గవర్నమెంట్** వచ్చి 3 గంటల కరెంటు ఇస్తే ఒక్క గుంట కూడా తడ్వది. 10 ఎస్పర్ మోటర్లు పెట్టాలంటే ఎన్ని పైసల్ గావాలె. రైతులు ఆస్తులను అమ్ముకోవాలె. అప్పట్లో ఎన్ని కష్టాలు పెట్టింద్రు. ఒక్క పంట తీయాలంటే పానం పోతుండె. అప్పులు కట్టంగ.. రూపాయి కూడా చేతికి రాకుండె. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంకనే నోట్లెకు బువ్వ పోతున్నది. సీఎం కేసీఆర్ రైతులను బాగా కాపాడుకుంటున్నడు. 24 గంటల ఫ్రీ కరెంటు ఇస్తున్నడు. నీళ్లిస్తున్నడు. పెట్టుబడి ఇస్తున్నడు. పంటలు కొంటున్నడు. ఇవన్నీ కాదని, కాంగ్రెస్‌ను తెచ్చి నెత్తిమీద పెట్టుకుంటే మాకు సావేగతి. ఎవుసం మొత్తం నాశనం అయిపోతది.

-పీర్‌గొండ, పత్లాపూర్, బిచ్కుంద మండలం

## కాంగ్రెస్ వస్తే మళ్లీ సావులే..



**గప్పట్ల కాంగ్రెస్** సర్కారు ఉన్నప్పుడు రైతులను ఎంత కష్టవెట్టింద్రు. కరెంటియ్యకుండె.. నీళ్లియకుండె. పంటలకు ధర ఇయ్యకుండె. జంగల్‌కు పోయి కరెంటు కోసం ఎదురుసూస్తుంటిమి. గన్ని కష్టాలు మళ్లీ రావొద్దు. వస్తే రైతులకు సావే ఉంటది. తెలంగాణ వచ్చినంకనే సీఎం కేసీఆర్ సారు రైతులకు ఫుల్లుగా కరెంటు ఇస్తున్నడు. ఎప్పుడు కావాలంటే అప్పుడు కరెంటు ఉంటున్నది. పొలాలకు నీళ్లు పారియ్యాలంటే ఏ బాధా లేదు. గుంట భూమి కూడా ఎండిపోతేలేదు. పంటలు బాగా పండుతున్నయ్. రైతులు చాలా సంబురంగా ఉన్నరు.

-శేకెల్లి బాలయ్య, రైతు, అడ్లూర్ ఎల్లారెడ్డి